క్లుప్తంగా

క్యాజువాలిటీ విస్తరణకు చర్యలు



క్యాజువాలిటీ విస్తరణ పనులను పరిశీలిస్తున్న డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు (హాస్పిటల్) : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో క్యాజువాలిటీ విస్తరణకు చర్యలు చేపట్టినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. పూర్వ ఈసీజీ రూమ్, ఫార్మసీ రూమ్, నర్సింగ్ రూమ్ స్థానంలో క్యాజువాలిటీ విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి అవసరమైన 20 పడకలను కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి వితరణ చేస్తున్నారని తెలిపారు. త్వరలో పూర్తిస్థాయిలో మరమ్మతు పనులు పూర్తి చేసి నూతన క్యాజువాలిటీని ప్రారంభిస్తామన్నారు.

ఖాళీ టీచర్ పోస్టులన్నీ భర్తీ చేయాలి



యూటీఎఫ్ సభ్యత్వ రసీదు అందజేస్తున్న నాయకులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 25 వేల టీచర్ పోస్టులన్నీ భర్తీ చేసి, ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవి కుమార్ కోరారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని పాఠశాలల్లో ఆ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. నూతన ప్రభుత్వం 117 జీఓను రద్దు చేయాలని, ప్రతి పాఠశాలల్లో ఇద్దరు టీచర్లు ఖచ్చితంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం కర్నూలు మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, సోమన్న, జిల్లా కౌన్సిలర్ జయరాజు, రామచంద్రుడు, శేషఫణి, హనుమన్న, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, డీజీపీలను కలిసిన ఎంపీ



మంత్రి సవితకు బొకే అందజేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు సిటీ: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను శనివారం విజయవాడలోని మంత్రి పేషీలో కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కర్నూలు పార్లమెంటు పరిధిలోని పలు సమస్యలను మంత్రికి వివరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో తెలుగు యువత మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కురువ సంఘం జిల్లా నాయకులు మద్దిలేటి, కార్పొరేటర్ పరమేష్, అట్టేకలు జీవన్ ఉన్నారు. రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమల రావును కూడా ఎంపీ బస్తిపాటి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

డయేరియాపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

కల్లూరు: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ క్యారదర్శులు, కల్లూరు, ఉలిందకొండ పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు, ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు శైలేష్ కుమార్, రఘు, ఈఓఆర్డీ రవికిషోర్, పంచా యతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల సీజ్

కర్నూలు (టౌన్) : మండల పరిధిలోని దిన్నె దేవరపాడు గ్రామంలో శనివారం ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టారు. సమాచారం అందుకున్న గనుల శాఖ అధికారులు తనిఖీ చేసి పట్టుకున్నారు. పనులను నిలిపివేసి, రెండు హిటాచీ వాహనాలను సీజ్ చేసినట్లు గనుల శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ వెల్లడించారు. తనిఖీల్లో ఆ శాఖ విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



లలితా పీఠంలో వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా ఏరువాక పౌర్ణమి

కర్నూలు కల్చరల్: ఏరువాక పౌర్ణమి పర్వదినాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యవసాయ పనిముట్లను శుభ్రం చేసుకొని పసుపు కుంకుమలు అద్ది పూజలు చేశారు. ఎద్దులను శుభ్రంగా కడిగి వాటి కొమ్ములకు రంగులు పూసి కాళ్లకు గజ్జలు కట్టి పూజించారు. పొంగలిని ప్రసాదంగా చేసి వాటికి తినిపించారు. తర్వాత బసవన్నలను వీధుల్లో సంబరంగా ఊరేగించారు. పలువురు రైతులు పొలాలను దున్ని వ్యవసాయ పనులు ప్రారంభించారు.

- నగరంలోని సూర్య నారాయణస్వామి ఆలయంలో రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో పౌర్ణమిని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, అర్చనలు, వ్రతాలు చేశారు.



లలితా పీఠంలో అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



సూర్యనారాయణ స్వామి ఆలయంలో హారతి తీసుకుంటున్న భక్తులు

ఒలింపిక్ స్థాయికి ఎదగాలి

- ఒలింపిక్ డే వేడుకల్లో జిల్లా కలెక్టర్ సృజన
- ఎస్పీతో కలిసి క్రీడా జ్యోతుల ఆవిష్కరణ
- 5 కూడళ్ల నుంచి విద్యార్థులు, క్రీడాకారుల ఒలింపిక్ రన్

కర్నూలు (టౌన్) : క్రీడాకారులు నిత్య సాధనతో ఒలింపిక్ స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. శనివారం జిల్లా ఒలింపిక్ సంఘం, జిల్లా క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఒలింపిక్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ సర్కిల్‌లో క్రీడా జ్యోతులను కలెక్టర్‌తో పాటు ఎస్పీ క్రిష్ణకాంత్ ఒలింపిక్ చైర్మన్, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ క్రీడా జ్యోతులను వెలిగించారు. తర్వాత నగర వీధుల్లో ఒలింపిక్ రన్ నిర్వహించారు. ఇందులో విద్యార్థులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రాన్ని క్రీడల నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆటల్లో ప్రతిభ చాటితే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ క్రిష్ణ కాంత్ మాట్లాడుతూ గతంలో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యకి ఇచ్చిన ప్రాధాన్యత క్రీడలకు ఇచ్చేవారు కాదన్నారు. ప్రస్తుతం వారిలో మార్పు వచ్చిందని చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. జిల్లా ఒలింపిక్ సంఘం చైర్మన్ మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను బయటకు తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులకు, మంచి పాటలతో అలరించిన అహమ్మద్ మియ్యా కళా బృందానికి కలెక్టర్, ఎస్పీలు మెమోంటోలు అందజేశారు.

ఐదు కూడళ్ల నుంచి పరుగు :

నగరంలోని ఓల్డ్ టౌన్, స్టేడియం, ఏపీఎస్‌పీ క్యాంపు, బిర్లాగేట్, చెన్నమ్మ సర్కిల్ నుంచి విద్యార్థులు, క్రీడాకారులు క్రీడా జ్యోతులతో రన్ నిర్వహించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ సృజన



సీక్యాంప్ నుంచి స్టేడియం వరకు ఒలింపిక్ రన్

కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేఈ జగదీష్ కుమార్, శ్రీనివాసులు, రాష్ట్ర యోగ సంఘం చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, శ్రీధర్ రెడ్డి, సెట్కూర్ సీఈఓ రమణ, జిల్లా క్రీడల అభివృద్ధి అధి కారి భూపతిరావు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య, అవినాష్ శెట్టి, రుద్రా రెడ్డి, సునీల్‌కుమార్, ఈశ్వర్ నాయుడు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ఒలింపిక్ డేను పురస్కరించుకొని నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన సంసిద్ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఒలింపిక్ డే వేడుకలు నిర్వహించారు. 8 నుంచి 10 సంవత్సరాల వయస్సు బాలికల విభాగంలో రేహా (ప్రథమస్థానం), బాలుర విభాగంలో సాత్విక్ (ప్రథమ స్థానం), 10 నుంచి 12 సంవత్సరాల బాలికల విభాగంలో మనుశ్రీ (ప్రథమ స్థానం), క్రిష్ణప్రియ (ద్వితీయ స్థానం), 12 నుంచి 14 సంవత్సరాల వయస్సు బాలికల విభాగంలో కీర్తన (ప్రథమ స్థానం), నక్షత్ర (ద్వితీయ స్థానం), మౌనిక (తృతీయ స్థానం), 14-16 సంవత్సరాల వయస్సు బాలికల విభాగంలో స్ఫూర్తి (ద్వితీయ స్థానం)లో నిలిచారు. కేశవ రెడ్డి విద్యార్థులు మోక్షిత్, రోహిత్, వరుణ్ , యువన్, హర్షిత్, హర్షన్విత సైతం యోగాపోటీల్లో పతకాలు సాధించారు.

కలెక్టర్‌ను సత్కరించిన ఏపీ ఎన్‌జీఓ నాయకులు



జిల్లా కలెక్టర్ సృజనను సత్కరిస్తున్న ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్నికల విధులను నిర్లక్ష్యం చేశారనే కారణంతో 103 మంది అధికారులు, ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్ ఎత్తి వేసిన నేపథ్యంలో ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ నేతలు కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కలిసి సత్కరించారు. శనివారం వారు కలెక్టర్‌ను చాంబరులో కలిశారు. కోరిన వెంటనే స్పందించి సస్పెన్షన్‌ను ఎత్తి వేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి, జవహర్‌లాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ ప్రధాన కార్యదర్శి హృదయరాజు, ఎన్‌జీఓ అసోసియేషన్ నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి, జిల్లా నాయకులు బలరామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కేసీహెచ్ కృష్ణుడు, శ్రీనివాసులు, సాయిరామ్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, వ్యవసాయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రవిప్రకాశ్‌రావు, వెటర్నరీ పార ఉద్యోగుల సంఘం నేత వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

29న పీడీఎస్‌యూ కౌన్సిల్ సమావేశం



కరపత్రాలను విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కర్నూలు సిటీ: ఈ నెల 29వ తేదీన విజయవాడలో పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎండీ రఫీ తెలిపారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీలో సమావేశానికి సంబంధించిన కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ 1974 సంవత్సరంలో ఏర్పడిన పీడీఎస్‌యూ స్వేచ్ఛా, సమానత్వం కోసం, శాస్త్రీయ విద్యా సాధన, నూతన ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తుందన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణం కోసం జార్జిరెడ్డి, జేసీఎస్ ప్రసాద్, కోలా శంకర్, శ్రీపాద శ్రీహరి, చేరాలు వంటి వారు ప్రాణాలను అర్పించారన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు షాహిద్, బాలాజీ, నాగరాజు, బాషా, కళ్యాణ్, నాయమతుల్లా, వీరేంద్ర, పవన్, హరి, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ రివిజన్ చేయాలి

- బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బోసు

కర్నూలు(సెంట్రల్): బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్లకు 2017 జనవరి 1 నుంచి 15 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణతో సంబంధం లేకుండా పెన్షన్ రివిజన్ చేయాలని ప్రభుత్వాన్ని బీఎస్‌ఎన్‌ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కెఎస్‌సీ బోసు డిమాండ్ చేశారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఆల్ ఇండియా బీఎస్‌ఎన్‌ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ కర్నూలు జిల్లా నాలుగో ద్వైవార్షిక మహాసభలు జిల్లా అధ్యక్షుడు ఎం.శివారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కెఎస్‌సీ బోసు మాట్లాడుతూ.. ఫిక్సడు మెడికల్ అలవెన్సును నెలకు 1000 నుంచి మూడు వేలకు పెంచాలన్నారు. పెన్షన్ కమ్యూనికేషన్ 15 సంవత్సరాల తరువాత కాకుండా 12 సంవత్సరాలు పూర్తి కాగానే ఇవ్వాలన్నారు. అడిషినల్ పెన్షన్ 65 సంవత్సరాలు నిండగా 5 శాతం, 70 సంవత్సరాలకు 10 శాతం, 75 సంవత్సరాలకు 15 శాతం ఇవ్వాలని కోరుతూ జూలై 2వ తేదీన నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆగస్టులో ధర్నాలు, సెప్టెంబర్‌లో చలో ఢిల్లీ కార్యక్రమాలను చేపట్టేలా ప్రణాళికలను రూపొందించినట్లు చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ గఫూర్ మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మిక, పెన్షనర్లపై వ్యతిరేక భావాన్ని వీడాలన్నారు. కార్యక్రమంలో బీఎస్‌ఎన్‌ఎల్ డీజీఎం రాజేశ్వరరావు, నాయకులు రామారావు, పి.అక్బర్‌బాషా, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేఎస్‌సీ బోసు

తెలుగునాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా నాగరాజు

కర్నూలు (హాస్పిటల్) : తెలుగునాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన ఎం.నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 21న ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు మంగళగిరిలోని టీడీపీ సెంట్రల్ ఆఫీస్‌లో నిర్వహించారన్నారు. ఇందులో జిల్లాకు చెందిన తాను అధ్యక్షుడిగా నంద్యాలకు చెందిన రాఘవేంద్ర గౌడు, ఎంవీ సుబ్రహ్మణ్యం, కర్నూలుకు చెందిన మద్దయ్య జాయింట్ సెక్రటరీలుగా ఎన్నికయ్యారన్నారు.

పెరిగిన ఆదాయం

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని ఆలయాల భూములకు శనివారం వేలం పాట నిర్వహించినట్లు ఈఓ సువర్ణ తెలిపారు. ఆమె మాట్లాడుతూ దేవదాయశాఖ పరిధిలోని ఆలయకు సంబంధించి మొత్తం 49 ఎకరాలకు గాను 6.95 ఎకరాలు మినహాయించి మిగిలిన 42.05 ఎకరాల భూమి కౌలుకు వేలం నిర్వహించామన్నారు. వీటికి గతేడాది వేలం ద్వారా రూ.1,69,000 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.3,14,500 ఆదాయం సమకూరిందన్నారు. వీటిలో వీరనారాయణస్వామికి చెందిన 10 ఎకరాల భూమికి గతేడాది రూ.53,500 రాగా ఈ ఏడాది రూ.82,000 పలికిందన్నారు.

నేడు పాణి హట్టి చిడాదహి మహోత్సవం

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో నగర వనంలో ఆదివారం ఉదయం 9 గంటలకు పాణి హట్టి చిడాదహి మహోత్సవం జరుగుతుందని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు తెలిపారు. శ్రీకృష్ణబలరాములను మహా శంఖాభిషేకం, 108 రకాల పదార్థాలతో మహారాజ భోగ నివేదన, తిరుపతి ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రూపేశ్వర చైతన్య ప్రభుచే ప్రత్యేక ప్రవచనం, మహా ప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇస్కాన్ సభ్యులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఏడు నెలల బాబుకు గుండెలో రంధ్రం

- ఆరోగ్యశ్రీలో ఉచితంగా శస్త్రచికిత్స

కర్నూలు (హాస్పిటల్) : చిన్నపిల్లలకు గుండెలో రంధ్రం ఉండటం సహజంగా వింటుంటాం. కానీ గుండెలో 12 మి.మీ పరిమాణంలో పెద్ద రంధ్రం ఉండటం అరుదుగా జరుగుతోంది. ఇలాంటి రంధ్రాన్ని కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి మూసివేశారు. ఆ వివరాలను ఆసుపత్రికి చెందిన చిన్నపిల్లల గుండె వైద్యనిపుణులు డాక్టర్ మహమ్మద్ ఫరూక్ తెలిపారు. 'పత్తికొండకు చెందిన దంపతులకు మొదటి సంతానంగా మగపిల్లాడు జన్మించాడు. అయితే కొంత కాలం బాబు ఆరోగ్యం బాగానే ఉన్నా ఆ తర్వాత ఆయాసం రావడం మొదలైంది. పలువురు వైద్యులకు చూపించగా గుండె సమస్య ఉందని చెప్పారు. దీంతో వారు కిమ్స్ ఆసుపత్రికి రాగా గుండెలో అతిపెద్ద రంధ్రం (డీఓఆర్‌వీ) ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. వైద్య పరిభాషలో దీనిని మాల్ ఎలైన్డ్ కోనో వెంట్రిక్యులర్ వీఎస్‌డీ అంటారు. గుండెలో రంధ్రంతో పాటు గుండె రక్తనాళాలు సరిగా అనుసంధానం కాకపోవడంతో కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ భరత్ సిద్ధార్థ, అనస్థటిస్ట్ డాక్టర్ వలజ జ్యోత్స్న, పర్ఫ్యూజనిస్ట్ జి.వి.రమేష్ రెడ్డి బృందం కలసి బాబుకు ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ చేసి సరిచేశారు. కొన్ని రోజుల పాటు చికిత్స అనంతరం బాబు కోలుకోవడంతో డిశ్చార్జి చేశాము' అని డాక్టర్ మహమ్మద్ ఫరూక్ వివరించారు.

వైభవంగా జగన్నాథ స్వామి స్నాన యాత్ర మహోత్సవం



సందేశమిస్తున్న రఘునందన సేవక్ ప్రభు

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో శనివారం వైభవంగా శ్రీ జగన్నాథ స్వామి స్నాన యాత్ర మహోత్సవం జరిగింది. ఇస్కాన్ ప్రవచకులు వైష్ణో కృప చైతన్య ప్రభు, కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు స్వామివార్లకు సుగంధ జలాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. 56 రకాల పదార్థాలతో మహారాజ భోగ నివేదన చేసి మహారాజ భోగ హారతి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి స్నాన యాత్ర ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం రఘునందన సేవక్ ప్రభు సందేశమిచ్చారు.



స్వామివార్లకు స్నాన యాత్ర ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

పరామర్శ

కర్నూలు సిటీ: గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకున్న పంచలింగాల గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి తల్లి రామచంద్రమ్మను, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న అదే గ్రామానికి చెందిన సాయన్న తాత చిన్న నాగప్పను, అనారోగ్యంతో బాధపడుతున్న నందనపల్లె గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ శేషిరెడ్డిని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్లహర్షవర్ధన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రామచంద్రమ్మ, చిన్న నాగప్పను మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సతీష్ కోరారు.

- మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన పెరుగు శ్రీధర్ రెడ్డి మాతృమూర్తి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి శ్రీధర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట ఆ గ్రామ మాజీ సర్పంచ్ పెరుగు భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ రాంనాథ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



శేషిరెడ్డిని పరామర్శిస్తున్న డా.ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి

వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో గ్రేడు-2 వీఆర్వోలుగా పనిచేస్తున్న వారికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు వి.గిరికుమార్‌రెడ్డి కోరారు. శనివారం ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో వీఆర్వోలు కలెక్టర్ డాక్టర్ జి.సృజనను ఆమె కార్యాలయంలో కలసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల విధుల్లో పాల్గొన్న వీఆర్వోకలు టీఏ, డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘంఅధ్యక్షుడు కరణం పార్థసారథి, ప్రధాన కార్యదర్శి కె.సూర్యాబాబు, ట్రెజరర్ ఎం.మద్దిలేటి పాల్గొన్నారు.



కలెక్టర్ సృజనకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు

బంగారుపేటలో కార్డెన్ సెర్చ్

- 150 లీటర్ల నాటుసారా, 100 కేజీల నల్లబెల్లం స్వాధీనం

కర్నూలు : కర్నూలు బంగారుపేటలో శనివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో సివిల్, సెబ్ పోలీసులు పెద్ద ఎత్తున ఆ ప్రాంతానికి చేరుకోవడంతో సారా విక్రయదారులు కొంతమంది కాలనీ నుంచి పరారయ్యారు. కేసీ కెనాల్ గట్టుపై ఉన్న నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. కుండలు, ప్లాస్టిక్ బిందెలు, డమ్ములు ధ్వంసం చేశారు. 2,400 లీటర్ల నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 150 లీటర్ల నాటుసారా, 100 కేజీల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో ఎక్కడైనా నాటుసారా, మద్యం అక్రమ రవాణా జరుగుతుంటే డయల్ 100కు లేదా స్థానిక పోలీసులకు గాని సమాచారం ఇవ్వాలని కోరారు. నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలను మానుకుని ప్రత్యామ్నాయ వృత్తి ద్వారా గౌరవమైన జీవితాన్ని సాగించాలని డీఎస్పీ నీలిషికారీలకు సూచించారు. సీఐలు ఇంతియాజ్ బాషా, పవన్‌కుమార్, శంకరయ్య, సెబ్ సీఐ నరసనాయుడు, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, ఎస్‌ఐలు శ్రీధర్ బాబు, రెహనా బేగం, మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ముర్తుజా వలి, మునుస్వామితో పాటు పోలీసు సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.



బంగారుపేటలో సారా స్థావరాలపై దాడులు చేసి స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీసులు

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

- నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. శనివారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో ఇంజినీరింగ్, ఆరోగ్య విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎస్‌ఎల్‌ఆర్ ట్యాంకులను ప్రతి రెండు వారాలకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. అలాగే ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని, ట్యాంకుల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. సచివాలయాల పరిధిలో ప్రతి రోజు వాటర్ శాంపిల్స్ తీసుకోవాలని, పైపు, ట్యాప్ లీకేజీలను అరికట్టాలన్నారు. నీటి నిల్వలకు అవకాశం లేకుండా గుంతలు వెంటనే పూడ్చాలన్నారు. పరిశుభ్రతపై శానిటేషన్ కార్యదర్శులు, ఆరోగ్య సహాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ఎక్కడైనా నమోదైతే వెంటనే యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. యాంటీ లార్వా, యాంటీ మస్కిటో ప్రక్రియలను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖాధికారి విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ షాకీర్ హుస్సేన్, సూపర్‌వైజర్లు నాగరాజు, డీఈఈలు , ఏఈలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్